క్లుప్తంగా

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కసిరెడ్డి

మాడ్గుల: మాడ్గుల మండలం అవురుపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో అవురుపల్లి గ్రామానికి చెందిన లింగయ్య చెన్నయ్య, మహేశ్, సాయిబాబా, మల్లేశ్, రమేశ్, రాజు, అనిల్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంపత్ కుమార్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటేయండి

ఆమనగల్లు: ఓటర్లు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటేయాలని ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమనగల్లు పట్టణంతో పాటు నుచ్చుగుట్టతాండ, ఎర్రబిక్యతాండల్లో సోమవారం ఆమనగల్లు పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. కవాతులో ఆమనగల్లు ఎస్‌ఐ బాల్‌రాం, ఏఎస్‌ఐలు బాల్‌రెడ్డి, యాదయ్య, పోలీసు సిబ్బంది, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నాయి.

ఆచారిని గెలిపించండి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ అభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థి ఆచారిని గెలిపించాలని ఆమనగల్లు మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు శ్రీకాంత్‌సింగ్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖర్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీలో సోమవారం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కాలనీలో బీజేపీ అభ్యర్థి ఆచారికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజాసమస్యల పరిష్కారానికి బీజేపీ అనేక ఉద్యమాలు చేపట్టిందని గుర్తుచేశారు. బీజేపీ అభ్యర్థి ఆచారి ఎన్నికలలో ఓడిపోయినా ప్రజల మధ్యే ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నారని తెలిపారు. ఈ ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్‌లు చెన్నకేశవులు తదితరులు ఉన్నారు.

చెక్‌పోస్ట్ పరిశీలన

అబ్దుల్లాపూర్‌మెట్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాల తనిఖీ కోసం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్ట్‌ను సోమవారం రాచకొండ పోలీస్ కమిషనరేట్ అదనపు సీపీ తరుణ్‌జోషి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయవాడ జాతీయ రహదారిపై వెళ్తున్న పలు వాహనాలను స్వయంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాస్పదంగా భవన శంకుస్థాపన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని పిగ్లీపూర్ గ్రామంలో సోమవారం యాదవ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం వివాదంగా మారింది. భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తుండగా.. స్థానిక సర్పంచ్ కోట రాధ, ఆమె భర్త లక్ష్మారెడ్డి, అతని సోదరులు యాదిరెడ్డి, సాగర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి భూమి పూజను అడ్డుకున్నారు. భవన నిర్మాణం చేస్తున్న భూమి తమదేనని, తమ భూమిలో భవనం ఎలా నిర్మిస్తారని కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. దీంతో ఆధారాలు చూపించాలని యాదవ సంఘం సభ్యులు ప్రశ్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. లక్ష్మారెడ్డి అతని సోదరులు శంకుస్థాపనను అడ్డుకోవడంతో పాటు తమను బెదిరించారని యాదవ సంఘం సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. లక్ష్మారెడ్డి, అతని సోదరులపై చర్యలు తీసుకోవాలని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగలు పడి బంగారాన్ని ఎత్తుకెళ్లారు. పట్టణంలోని మంచాల రోడ్డులో పాల్వ సరిత, మహేందర్ దంపతులు ఇంట్లోనే బ్యాంగిల్ స్టోర్, లేడిస్ కార్నర్ నడుపుతున్నారు. ఆదివారం ఇంటికి తాళం వేసి చెరువుగట్టుకు కుటుంబంతో వెళ్లారు. దీనిని గమనించి దొంగలు తాళాలు పగులగొట్టి ఇంట్లో ఉన్న నాలుగున్నర తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. కుటుంబసభ్యులు సోమవారం తిరిగి రావడంతో చోరీ విషయం బయటకు వచ్చింది. మహేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగదు పట్టివేత

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ ఔటర్ రింగ్ రోడ్డు పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద సోమవారం పోలీసులు రూ. 4.50లక్షల నగదును పట్టుకున్నారు. సంతోశ్ అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్తుండగా అతడి వాహనాన్ని తనిఖీ చేశారు. కారులో నగదును గుర్తించిన పోలీసులు డబ్బును స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి వాహనదారుడి వద్ద ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ మన్మోహన్ తెలిపారు.

సామాన్యుడికి 'కోడ్' అవస్థలు

- ఎన్నికల నియమావళికి అనుగుణంగా తనిఖీలు
- రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే సీజ్
- పక్కా ఆధారాలున్నా 24 గంటలు ఆగాల్సిందే
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారులు



మాల్‌లో చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న పోలీసులు

యాచారం: ఎన్నికల కోడ్ నేపథ్యంలో చేపడుతున్న తనిఖీలతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. వైద్యం, చదువుల కోసం ఫీజులు, శుభకార్యాలు, వ్యాపారలావాదేవీలతో పాటు ఇతర పనుల కోసం సామాన్య ప్రజలు నగదును తీసుకెళ్లేందుకు భయపడుతున్నారు. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి చెక్‌పోస్టు ఏర్పాటు చేసి ముమ్మరంగా వాహనాలను చెక్ చేస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ప్రతి వాహనాన్ని తనిఖీలు చేయడం వలన వాహనాదారుల్లో గుబులు పట్టుకుంది. మంగలిపల్లి, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల పోలీసులు వాహనాలను నిలిపి తనిఖీలు నిర్వహిస్తున్నారు. రూ.లక్షకు మంచి ఆన్‌లైన్‌లో లావాదేవీలు చేసినా.. సదరు ఖాతాదారుడి గురించి అధికారులు ఆరా తీస్తున్నారు. బ్యాంక్ ఖాతాలో డబ్బు ఉన్నా.. రూ. 50 వేలకు మించి డ్రా చేయలేని పరిస్థితి నెలకొంది.

ఆధారాలున్నా ఆగాల్సిందే..

నవంబర్ నెల ఆరంభం నుంచే శుభముహూర్తాలు ప్రారంభమవుతాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో అవసరమైన ఆభరణాలు, బంగారం కొనుగోలు కోసం నగదును తీసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. తులం బంగారం కొనాలంటే రూ.62వేలు అవసరం. పెళ్లికి ఐదు తులాల నుంచి పది తులాల వరకు బంగారం కొనుగోలు చేయాల్సి ఉంటుంది. రూ.లక్షల్లో నగదును తీసుకెళ్తే పోలీసులు ఎక్కడ పట్టుకుంటారోనని ఆందోళన చెందుతున్నారు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తే.. ఆ మొత్తానికి సంబంధించిన వివరాలు అధికారులకు తెలపాలి. లేకుండా నగదును సీజ్ చేసే అధికారం పోలీసులకు ఉంది. పక్కా ఆధారాలున్నా 24 గంటలు ఆగాల్సిందే. ఒకవేళ ఆ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోతే కష్టాలు తప్పవు. అవసరాల కోసం డబ్బు తీసుకెళ్తే ఎక్కడ పోలీసులకు పట్టుబడుతామోనని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

వణుకుతున్న రియల్టర్లు

సామాన్యుడి పరిస్థితి ఇలా ఉంటే రియల్టర్లు మరింత జంకుతున్నారు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, ఆదిబట్ల తదితర మండలాల్లో ప్లాట్ల క్రయ, విక్రయాలు జరిపే వ్యాపారులు కఠిన నిబంధనలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. ఇబ్రహీంపట్నం వ్యాపారులు నల్గొండ జిల్లా చింతపల్లి, మర్రిగూడ, దేవరకొండ, నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట, కల్వకుర్తి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ భూములు కొనుగోలుకు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్లు చేసుకునే గడువు వచ్చింది. గడువు మీరడంతో భూముల, ప్లాట్ల విక్రయదారులు డబ్బులిచ్చి రిజిస్ట్రేషన్లు చేసుకోండి, లేదంటే అదనంగా చెల్లించాల్సి వస్తుందని ఒత్తిడి పెంచుతున్నారు. ఎలాగైనా డబ్బులను మీరే తెచ్చి మా ఇంటి వద్ద ఇవ్వండి... స్లాట్లు బుక్ చేసుకుని రిజిస్ట్రేషన్లు చేసుకోండి... లేదంటే మీ ఇష్టం అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. కొనుగోలు దారులు కూడా రూ.లక్షల్లో డబ్బులు తీసుకెళ్తే ఎక్కడ పోలీసులు పట్టుకుంటారోనని, నగదు దొరికితే పట్టుకున్న తర్వాత ఏం సమాధానం చెప్పాలని మల్లగుల్లాలు పడుతున్నారు.

> **కఠినంగా నిబంధనలు అమలు**
>
> 
>
> అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నాం. సాగర్ రోడ్డుపై రాకపోకలు సాగించే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నాం. వెంట తీసుకెళ్తున్న డబ్బుకు ఆధారాలుండాలి. ఎన్నికలు ముగిసే వరకు రూ.50 వేలకు మించి డబ్బులు తరలించకపోవడం ఉత్తమం.
>
> – సైదయ్య, సీఐ యాచారం

కాంగ్రెస్ పాలనలోనే న్యాయం



ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: కాంగ్రెస్ పార్టీ పాలనలోనే ప్రజలందరికీ న్యాయం జరిగిందని ఆమనగల్లు ఎంపీపీ అనిత, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం 9వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా అనిత, జగన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ పార్టీ పాలన అందిస్తుందని వారు అన్నారు. ఎన్నికల్లో అనేక హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని కోరారు. కల్వకుర్తి అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న కసిరెడ్డి నారాయణరెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణనాయక్, శివలింగం, సురేశ్‌నాయక్, రామకృష్ణారెడ్డి, నాజర్, మహేశ్, సురేశ్, రాజు, జయదేవ్‌రెడ్డి, హరనాథ్‌రెడ్డి, శివ, రవి, మోహన్, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రచార రథాలు సిద్ధం



ఇబ్రహీంపట్నం చేరుకున్న బీఆర్‌ఎస్ ప్రచార రథాలు

ఇబ్రహీంపట్నం: ప్రచారంలో పరుగులు పెట్టేందుకు బీఆర్‌ఎస్ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రత్యేకంగా తయారు చేయించిన ఎన్నికల ప్రచార రథా లు సిద్ధమయ్యాయి. డీసీఎం వాహనాలను గులాబీ రంగుతో అందంగా అలకరించారు. మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలిపించాలని, పోలింగ్ తేదీని సూచిస్తూ ప్రచార రథాలపై సీఎం కేసీఆర్, కిషన్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలను కట్టి, కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అదేవిధంగా కళాకారుల ఆటపాటలతో ప్రచారం చేసేందుకు ప్రత్యేక రథాలను కూడా సిద్ధం చేశారు. ప్రజలను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. గ్రామాల్లో విస్తృతంగా తిరుగుతూ బీఆర్‌ఎస్ గెలుపు కోసం ఈ వాహనాల ద్వారా ప్రచారం చేయనున్నారు. నామినేషన్ల సమయం దగ్గర పడుతుండటంతో ప్రచారంలో దూసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ నేతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

ఆశీర్వదించండి.. సేవకుడిగా ఉంటా

- అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓట్లేయండి
- కాంగ్రెస్, బీజేపీ పని అయిపోయింది
- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి



మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి గొర్రెపిల్లను బహుకరిస్తున్న యాదవులు

యాచారం: ఆశీర్వదించి నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తే మీ సేవకుడిగానే పనిచేస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో తాను చేసిన అభివృద్ధి చూసే ఓట్లేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చింతపట్ల గ్రామంలో ఆదివారం రాత్రి ప్రజాఆశీర్వాద సభ, తెలంగాణ ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలప్పుడే రాజకీయాలు చేశాను తప్పా, మిగతా సమయాల్లో అన్ని వర్గాల సమస్యలు పరిష్కరించినట్లు గుర్తుచేశారు. యాచారం మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, కుల సంఘాలకు స్థలాలు ఇచ్చి కమ్యూనిటీ భవనాలు నిర్మించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలప్పుడే వచ్చే కొత్త నాయకుల మాటలు నమ్మి వారికి అవకాశమిస్తే సర్వం దోచుకపోతారని హెచ్చరించారు. అంతకుముందు కిషన్‌రెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి భాషా, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటేశ్, చంద్రయ్య, జగన్, మధుకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారం

మండల పరిధిలోని నల్లవెల్లి గ్రామంలో సోమవారం బీఆర్‌ఎస్ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు యాదయ్య గౌడ్, రాములు, లక్ష్మీపతిగౌడ్, రవి గ్రామంలోపర్యటించి రైతుబంధు, పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్ పథకాలు ద్వారా లబ్ధిపొందిన ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్, బీజేపీని నమ్మితే కన్నీళ్లే

- హస్తం, కాషాయ పార్టీల అభ్యర్థులకు బుద్ధి చెప్పాలి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: కాంగ్రెస్, బీజేపీని నమ్మితే కన్నీళ్లే మిగులుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న కార్యక్రమాలు, అభివృద్ధి పనులను అడ్డుకుంటున్న ప్రతిపక్ష పార్టీలకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలోని బీసీ కాలనీ, విఠాయిపల్లి గ్రామంలో సోమవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు మద్దతుగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుబంధును నిలిపివేయాలని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందని మండిపడ్డారు. అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు అనేక హామీలు ఇస్తున్నాయని దుయ్యబట్టారు. ఎన్నికల్లో జైపాల్‌యాదవ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గిరియాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు సయ్యద్ ఖలీల్, వెంకటయ్య, బాలకృష్ణ, సైదులు గౌడ్, జగన్, సుభాశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ డిపాజిట్లు గల్లంతు

- అభివృద్ధి నిరోధకులకు గుణపాఠం చెప్పాలి
- బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ప్రజలతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతుకానున్నాయని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి నిరోధకులుగా మారిన ఆ పార్టీ నాయకులకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామంలో సోమవారం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి జైపాల్‌యాదవ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాధించిన విజయాలు, కల్వకుర్తి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని, ఇక్కడ అమలవుతున్న సంక్షేమ పథకాలు మరే రాష్ట్రంలో లేవని గుర్తుచేశారు. సంక్షేమ పాలన అందిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూడవసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించానని, మరోసారి తనకు అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం, జెడ్పీటీసీ అనురాధ, మండల ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు కుమార్, మండల టీఆర్‌ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, కోనాపూర్ ఎంపీటీసీ సరిత పంతునాయక్, పలువురు బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ కారణజన్ముడు

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ కారణజన్ముడని ఎమ్మెల్యే జపాల్‌యాదవ్ కొనియాడారు. సోమవారం మండలంలోని చుక్కాపూర్, యడవల్లి గ్రామాల్లో కల్వకుర్తి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి ఫుడ్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, గోలి శ్రీనివాసురెడ్డి, మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ సత్యం కలిసి ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం చుక్కాపూర్ గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీలో పదవులు అనుభవించి వెన్నుపోటు పొడిచిన ఓ నాయకుడు ఇటీవల కాంగ్రెస్‌లో చేరాడని, అలాంటి ద్రోహులకు ఎన్నికల్లో తగిన బద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కేసీఆర్‌తోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. 76 ఏళ్లలో రాష్ట్రంలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ 9 ఏళ్లలో చేసి చూపించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను ప్రజలకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు నర్సింహ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు రహ్మాన్, బీఆర్‌ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, సర్పంచ్ కృష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం



ప్రధాని చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

తలకొండపల్లి: రాష్ట్రంలో బీజేపీ ప్రభంజనం మొదలైందని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థుల డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమని కల్వకుర్తి నియోజకవర్గ బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ ఎద్దేవాచేశారు. బీసీలకు రాజ్యాధికారం బీజేపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తామని అమిత్‌షా ప్రకటించారని గుర్తు చేశారు. సోమవారం మండల కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థులకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలుపించాలని కోరారు. కల్వకుర్తిలో బీజేపీ అభ్యర్థి ఆచారి అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పాండు, సర్పంచ్ కుమార్, నాయకులు రవిగౌడ్, హరికాంత్‌గౌడ్, రమేశ్, విజయ్ కుమార్, యాదయ్య, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కారు.. జోరు



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు, శ్రేణులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. కారు గుర్తుకు ఓటు వేయాలని ఊరువాడ అభ్యర్థిస్తున్నారు. సోమవారం ఇబ్రహీంపట్నంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి, బీఆర్‌ఎస్వీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, కౌన్సిలర్లు బాలరాజ్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్, కంచకట్ల భాస్కర్ ఇంటింటికీ వెళ్లి.. కారు గుర్తుకు ఓటు వేయాలని వేడుకున్నారు. కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి పనులు, సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ ఎన్నికల మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం చేశారు.

బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ ఖాయం

తుర్కయంజాల్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ హ్యాట్రిక్ ఖాయమని బ్రాహ్మణపల్లి కౌన్సిలర్ మల్లేశ్, రైతు సేవా సహకార సంఘం డైరెక్టర్ శ్రీను ధీమా వ్యక్తం చేశారు. సోమవారం తుర్కయంజాల్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంపతీశ్వర్ రెడ్డి, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తుర్కయంజాల్‌లో మాజీ సర్పంచ్ దశరథ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిచారు.

ఇంటింటి ప్రచారం

మంచాల: మండలంలో పలు గ్రామాల్లో సోమవారం గులాబీ పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. జాపాల గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించి.. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ పుల్లారెడ్డి, జిల్లా నాయకుడు రాంరెడ్డి, మండల నాయకులు నాగరాజు, యాదయ్య, చంద్రకాంత్, వీరేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే విజయానికి నాంది

ఇబ్రహీంపట్నం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రజాసంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థుల విజయానికి నాంది పలుకుతాయని ఇబ్రహీంపట్నం మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ మంచిరెడ్డి వెంకట ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఎల్మినేడు గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మహేందర్ రెడ్డి, నాయకులు బాల్‌రాజ్, రాంరెడ్డి, మహేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



పట్టుబడిన మద్యం సీసాలతో ఎక్సైజ్ పోలీసులు

ఆమనగల్లు: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణదారులు, ఫంక్షన్ హాల్స్ యజమానులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఆమనగల్లు ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం సాలమ్మ అనే మహిళ నివాసంలో సోదాలు నిర్వహించి 55 మద్యం సీసాలు, 16 బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అక్రమంగా మద్యం నిలువ చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు యాదయ్య లోక్య తదితరులు ఉన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- ధాన్యం సేకరణలో అవకతవకలు
- ఆందోళన వ్యక్తం చేసిన రైతులు



సమావేశంలో రైతుల ఆందోళన

ఇబ్రహీంపట్నం: వరి ధాన్యం సేకరణలో అవకతవకలు జరిగాయంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చైర్మన్ వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన దండుమైలారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. సమావేశంలో చైర్మన్, సొసైటీ సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని రైతులు నిలదీశారు. ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు తరలించిన అనంతరం వచ్చిన అదనపు సొమ్మును జమ చేయకుండా చైర్మన్, సిబ్బంది వ్యక్తిగతంగా వాడుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు ప్రశ్నించడంతో సమావేశం నుంచి చైర్మన్ వెళ్లిపోయారు. దీంతో అర్ధాంతరంగా సమావేశం ముగిసింది.

విచారణ చేపట్టాలి

సొసైటీలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని, బాధ్యులను సస్పెండ్ చేయాలని రైతులు మల్లేశ్, సీతయ్య, గాలయ్య పలువురు డిమాండ్ చేశారు.

అవినీతి జరుగలేదు

సొసైటీ డబ్బుల్లో ఎలాంటి అవకతవకలు జరుగలేదని చైర్మన్ వెంకట్‌రెడ్డి తెలిపారు. తాను వ్యక్తిగతంగా వాడుకున్న డబ్బులకు సంబంధించిన వివరాలు పుస్తకం నమోదు చేశానని పేర్కొన్నారు. సొసైటీ సొమ్ము ఎవరు వాడుకున్న తిరిగి చెల్లించాల్సిందేనని, దీనిపై విచారణకు సిద్ధమేనని ప్రకటించారు.